# కవికలంలో కలకలం

శ్రీ కాశీభొట్ల సూర్యనారాయణ శాస్త్రి

‘శరత్కాలపూర్ణిమ తల విరియబోసుకుని ముసిముసి నవ్వులతో ప్రపంచమంతా పసిడినిగ్గుల ముగ్గులు పెడుతోంది. చంద్రుడు కొండమీద కూర్చుని ‘ముగ్గులు మాభేషుగ్గా వున్నాయ్’ అంటూ పకపకా నవ్వుతూ, పండువెన్నెల కాస్తున్నాడు. చుక్కలు తనచుట్టూ తిరుగుతూ ‘జాగ్రత్తా! చక్కలగింత పెడతాం’ అన్నట్టుగా కల్పిస్తూ సరసాలాడుతున్నయ్. ప్రక్కనున్న సన్నజాజినిండా వెన్నెల కురుస్తోంది. చుట్టూ పన్నీటి వాసన్లు చుట్టుకుంటున్నయ్. చల్లటి పిల్లవాయువులు సమయం దొరికిందికదా, అని పూలమొక్కలను కౌగలించుకుని పుష్పాలను ఆడిస్తున్నయ్. అప్పుడే చల్లగాలి చేరువలోనున్న సరోవరం మీదనుంచి సన్నగావచ్చి సరసు వదనాన్ని దూసింది. ఆగాలికి ఆమె ముంగురులు చెదరి ఫాలస్థలంమీద నాట్యమాడుతున్నయ్. ఇంతట్లోకే ఆమెదృష్టి అప్రయత్నంగా నైట్‌క్వీన్ మొక్కవైపుకు తిరిగింది. సరసు అట్లాగే చల్లగాలిలో పడుకుని పండువెన్నెల తింటూ, జాబిల్లికి కళ్లప్పగిస్తూ, తనభర్త అనంతం, యింకా రాకపోవటానికి కారణమేమిటా అని, ఆలోచిస్తోంది. మధ్య మధ్య కన్నీళ్లు కారుస్తూ చీర చెంగుతో కళ్లుతుడుచుకుంటోంది..., అంతే—

రాంబాబు రాసేకథ అంతవరకే అయింది. గబగబా పరుగెత్తవలసిన కలంపాళీ పట్టుపట్టి ఆగిపోయింది...కారణం?

రాంబాబు రాసేకథలు రజ్జుగానే యుంటాయని అందరికీ తెల్సు. గద్య పద్య రచనలలో ‘శృంగారకవి’ అని మెప్పు బడసినవాడే. ప్రతీవాడూ పుస్తకం తెరచి, అతనికథ చదివి తీరితేనే గాని మరొక కథకి మనస్సప్పగించడు. రాంబాబు రాసేకథ పూర్తికాలేదు. హృదయం బరువుగావుంది. ఉద్దేశ్యాలు పూరటంలేదు. భావాలు పైకి పొంగటంలేదు. ఆవేశం కుంటుపడింది. ఎడారిమీద నీళ్లబొట్టుమాదిరిగా ఉత్సాహం అసలే శూన్యం.—ప్రకృతి మాత్రం ప్రశాంతంగానే ఉంది. వర్ణించటానికి తగిన వాతావరణం వక్రించింది అతని మనస్సులో. తిరిగి కలంతీసి కాగితం మీద పెట్టాడు. కదలలేని పరిస్థితుల్లో తర్వాత అక్షరంకోసం తపించిపోతోంది ఆకలం.

బుఱ్ఱలో ధరించరాని ఆటంబాంబు లాంటిధ్వని—హృదయంలో ఊర్మికుల స్రోత—అర్థంకాని ఆందోళన—అదో ప్రవాహప్రహోరు—తాళలేకపోయాడు రాంబాబు. కుర్చీని ప్రక్కకువత్తిగించుకుంటూ ఒణికిపోయే ఒడలును టేబిలు మీదకు వంచాడు. కళ్లు చెమ్మగిల్లిపోతున్నాయ్. కొలకులు నిండా నీళ్లు నిండాయి. మెదిలకుండా కళ్లు మూసుకుని టేబిలుమీద పడుకున్నాడు.

పావుగంట పరిగెత్తింది కాలం. నాలుగుమంచు బిందువులు అతని వదనంమీద పడి అతన్ని మేల్కొల్పి వుంటాయి. మూర్ఛపోయిన మనిషిలాగ పిచ్చగాలేచాడు. వరండాలోనుంచి యింటివైపు తొంగిచూచాడు. ఏమీ తోచిందికాదు. విసురుగా నడిచివెళ్లాడు. దగ్గిరగా నొక్కివున్న తలుపులను కాళ్లతో డబాయించి తన్నేడు గట్టిగా. తిన్నగా పడకగదిలోకి వెళ్లి నుంచున్నాడు. కడుపులోనుంచి కెరటాలహోరు తన్నుకొస్తోంది. చూరునుంచి కారే వానచుక్కల్లాగ కళ్లంట నీళ్లు కారిపోతున్నాయి.-కారణం?; అక్కడ యేముంది?-

తన పెళ్లిఫోటో గోడకి తగలబడివుంది. ఆ తలంబ్రాల వస్త్రాలూ—ఆచామంతిపూల చమ్కీహారాలూ—8-2-47 ఆ పెళ్లి తేదీ: అవన్నీ చూచేసరికి: ఆ వివాహసమయం—ఆ మంగళధ్వనులూ— ఆ వైదిక మంత్రోచ్చారణలూ—ఆ తలంబ్రాలు పోయటం—ఆ దండలు వేసుకోవటం—అప్పటి తనప్రియురాలి క్రీగంటి చూపూ—ఆ సూత్రధారణ మొదలైన వన్నీ జ్ఞాపకం వచ్చివుంటాయ్. మరొకశోక తరంగం హృదయాన్ని చీల్చుకొచ్చింది. రామం మంచంమీద బోర్లపడ్డాడు. అవన్నీ తలుచుకొంటూవుంటే ఇంతట్లోకే అతని ప్రాణస్నేహితుడు యీశ్వరంగారంతా విని గబగబా పరుగెత్తుకొచ్చాడు తలుపులు తెరుచుకొని;

‘ఏరా! రామం!! ఏమిటి ఈ వికారం?’ అంటూ రాంబాబును కుదిపాడు. లేవలేదు రాంబాబు. ముఖంమీద

కాసిని నీళ్లు చల్లాడు. మరికొంత సేపటికి లేచికూర్చున్నాడు రామం.

'రామం? ఏమిటిరా హడా విడిచేస్తున్నావ్?'

మాట్లాడటం లేదు రామం.

'నేను చెప్పలేదూ! ఇంకా యేముంటుంది కారణం! అర్ధరాత్రివేళ పుట్టే అసాధ్యపు ఆలోచనలకు అంతుంటుందా? ఒంటరి జీవితానికి ఓపికా, ఓర్పూ వుండొద్దూ! హద్దులేని అకాల ప్రవాహం ఒక్కొక్కప్పుడు యిట్లాగే నెట్టుకొస్తుంది. కాస్తా కూస్తా నాలుగేండ్లవుతోంది మణి మాన్యాల కోసం దుబ్బలాడి, మల్లెపూవులాంటి యిల్లాల్ని వదిలేసి నీజీవితానికి మచ్చ తెచ్చుకున్నావ్. మాలాంటివాళ్ల హితవాక్యాలు నీ మతిని మళ్లించలేక పోయాయి. అందులో నీఒక రచయితవు. నీకొకళ్లు చెప్పాలా?—చెయ్యాలా? సమస్త విషయాలూ తెలిసివున్నవాడివి. అయినా యీకవిత్వం పిచ్చక్రిందేమైనా పరిణమించిందేమో!

'నేనింకా బ్రతుకలేనురా జయరాం!'

'నీమొహం! నువ్వు బ్రతుకలేక పోవటమేమిటి? నీకు నువ్వు ఆయుర్దాయం పోసుకున్నావా? నిన్ను పోతపోసి పుట్టించిన ఆబ్రహ్మకే తెలియాలి నువ్వు బ్రతకవలసిందీ లేనిదీ.

'జయరాం! వుండు. ఇంకో వికార ప్రవాహం వచ్చి నన్నీడ్చుకు పోతోంది. నేనింకా నిల్చోలేను. ఈ శరత్వెన్నెలలు నన్ను చీవాట్లు పెడుతున్నాయ్. ఆచందమామ నా కాఠిన్య హృదయాన్ని చూచి వెటకారంగా నవ్వుతున్నాడు. ఈ క్రిమి కీటకాదులు నన్ను చూచి కోలాహలం చేస్తున్నయ్! ఈ చుట్టూవీచేవి పిల్లగాలులుకావు—నామగతను పోగొట్టే మంచిగంధపు వాయువులు. ఉండూ! చూశావా; చంద్రుడు తన శీతకిణాలతో నన్ను పొమ్మని పొడుస్తున్నాడు. వెళ్లక పోతే నన్ను చంపుతాడేమో! మారుడు తనవిల్లుతో నా మనస్సులో గ్రుచ్చుతున్నాడు. నా మెదడులో యేదో పెద్ద ధ్వని బయలుదేరుతోంది. ఈ పాపిష్టి ప్రపంచంలో యీ కపట జీవితాన్ని గడపలేను. నేనింకా ఒక్క నిమిషం కూడా వుండలేను. పోవాలి; నా దుర్గదగ్గరకి పోవాలి. క్షమించమని వేడుకోవాలి. నువ్విక్కడే...వుండు' అంటూ ఉన్మాదుడులాగ వురికెత్తుక పోయాడు అక్కడనుంచి రాంబాబు. అప్పటికి వూరంతా మాటుమణగింది. అప్పటికి పద కొండు గంటలు మటుక్కు అయివుంటుంది.

రాంబాబుకు యిరవైయో యేటనే వివాహమైంది. లక్ష్మీప్రసన్నం కంటె సరస్వతీ ప్రసన్నం యెక్కువ అతనికి. తండ్రిలేడు. తల్లి వృద్ధురాలు. మరో అన్నగారి వద్ద వుందామె. మామగారికీ తనకీ వరకట్నంవద్ద యుద్ధమొచ్చింది. ఆయన ఇస్తానన్న వెయ్యినూటపదహార్లూ యింతవరకూ ఇవ్వలేక పోయాడు. అందుచేత నిర్దోషి అయిన ఆ అబలను, రత్నంలాంటి భార్య దుర్గను వదిలేశాడు రామం. దుర్గ తనకియెన్ని ప్రేమలేఖలు వ్రాసినా, యెన్నిసార్లు వేడుకున్నా, 'యేకాకినిగా యేడవమనే' ప్రత్యుత్తరమైంది రామందగ్గర నుంచి. కాని ప్రయోజనం లేకపోయింది. ఎంతమంది మిత్రులు హితబోధ చేసినా అతని బుద్ధిబాగుపడాలేదు—అంతకంటె కర్తవ్యం అతనికి తోచాలేదు!!

తన జీవితాన్ని దుఃఖ దేవత చేతుల్లోపెట్టి, రోజులు దొర్లించుకుంటుంది దుర్గ. ఈ అపనింద నెత్తిమీద పెట్టుకుని మోస్తూ పథ్యానికి కూడా పరులతో మాట్లాడని పరమ సౌశీల్యవతి ఆ దుర్గ, అట్లాగే కాలం వెళ్లబుచ్చుతోంది. ఆమె దుఃఖావేదనని చూడలేక ఆమె తల్లిదండ్రులు మరింత క్రుంగి పోతున్నారు. దుర్గ నామధేయానికి తగినట్లు సదా ఆమె వదనసీమలో ఆనందవికాసం తాండవిస్తూండేది. ఒక్కొక్కప్పుడు ఆమె దుఃఖాన్ని చూచి ఆమె లావణ్యరేఖలు వెక్కిరిస్తూవిరగబడి నవ్వేవికూడా. ఇల్లా ఆదుర్గ వియోగ సముద్రాన్ని మునిగి తేలుతో వుంటె—

తెల్లవారి ఝామున నాల్గుగంటలకల్లా అత్తావారింటికి చేరుకున్నాడు. రాంబాబు వరండాలో పడుకునివున్న బావ మరది హడావిడి కొద్దీ అతనిమీద టార్చి వేసి చూచాడు యెవరో అనుకుని. ఆలైటు వెలుతురులో అతని దురాలోచనలు దగ్ధమైనట్టు కళ్లుజిగాలు మని 'నేనేనోయే' అంటూ చక్కగా సమాధాన మిచ్చాడురామం.

'ఏం? యింత అర్ధరాత్రి వేళ, యిల్లా వచ్చావేంబావా?'

'లోపల తలుపు తీయిద్దూ, కే కెయ్యి ఒక్కసారి'— అన్నాడురామం.

రామం భావమరది తలుపు తీయించాడు. రాంబాబు మామగారూ, అత్తగారూ విస్తుపోయిచూస్తున్నా రతని వైపు.

'ఏంబాబూ: యిప్పటికి దయొచ్చిందా యీ నిరుపేద మీదకి. ఇంత ఖంగారుగా వచ్చావేం?'—అన్నారు మామగారు.

'నీవు మాట్లాడవేం? నాయినా!'—అంది అత్తగారు.

'దుర్గేదీ? ముందా సంగతి చెప్పండి, ఎక్కడుంది. ఒక్కసారి చూడనివ్వండి.' అంటూ ఆవేశ పడతాడు రాంబాబు.

'ఆ ఆవేశందేనికి రామం! ఇంకాలేవ లేదు. అదిగో అక్కడేపడుకుని వుంది. రా!' అంటూ లోపలికి తీసుకు వెళ్లి; బయటికి వచ్చేసింది అత్తగారు.

నిద్రాదేవత జోలపాటలో సుఖ డోలికలూగే దుర్గని లేపుతూ 'దుర్గా! దుర్గా!' అంటున్న రామం మంచంవద్ద నుంచుని.

దుర్గ కళ్లుతెరచి కంగారుగాలేస్తూ 'ఎవరు? ఎవరు? అంటూ గాభరా పడుతోంది.

'నేనుదుర్గా! నీరామంని. ఇన్నాళ్లనుంచీ నీ జీవితాన్ని విరామంలో; విషాదంలో; వియోగ దుఃఖసాగరంలో ముంచేసిన నీ నాధుణ్ణి రాంబాబుని దుర్గా. నన్ను; నీరామాన్ని, యీ దుర్మార్గుడ్ని క్షమించావూ?!,

'ఆ! ఆ! ఏమిటామాటలు. అంత ఘోరంగా మాట్లాడతారేం? ఆడదాన్ని నేను క్షమించటమేమిటి? చాలు. నాదే తప్పనుకోండి. గత విషయాలు మాట్లాడకండి, లేవండి.

'దుర్గా! ఈ పాపిని క్షమించటమే కాదు శిక్షించినా పాతకం తీరదు. నిన్ను తిరిగి పరిగ్రహిద్దామని వేడుకొంటున్నాను. ఒల్లవూదుర్గా! నాకు కట్నమూవద్దూ-కానుకా కానుకావద్దూ! నాపత్ని......,

'అట్లాంటిమాట లెందుకండీ! నే నొల్లక పోవటమేమిటి? నాహృదయాంతరాళంలో వుబికే వుల్లాసవాంఛే అది—ఉత్సాహవీచికే అది'

'అమ్మయ్యా!దుర్గా; నేటికి......'

'అవునుగాని; ఆ జేబులో కాగితా లేమిటి? తొంగి చూస్తున్నయ్?

'అదొక కథలే. దాన్నిగురించే మనకీకర్మ పక్వమైంది.'

'పూర్తికాలా?'

'అప్పటికి అంతవరకే అయింది. యిప్పటికి అయినట్టే. యిదిగో యిటుచూడు. తర్వాత నాలో అవాంతరం వచ్చింది. అప్పటి నీ మధుర సంభాషణ, యీ కథ గాసేటప్పుడు నా మనస్సును మరస్మృతు చేస్తూ, నాహృదయ మాలిన్యాన్ని పరిశుభ్ర పచింది.

'సరేగా?, అది పూర్తిచేయండి చూదాం?' అంది—దుర్గ.

'నువ్వుగూడా చెబుతావు కదూ?' అన్నాడు—రామం.

'ఊఁ'

'ఎంతవరకు అయింది. "భర్తరాకపోవటానికి కారణం యేమిటాఅని ఆలోచిస్తూ మధ్య మధ్య కన్నీళ్లు కార్తోంది. తన తప్పుకు తాను తెల్సుకుని అప్పుడు తలభర్త...తపించే తన భార్యవద్దకు వచ్చి...క్షమాభిక్ష...'

'ఆ! ఆ!అది వ్రాయకండి!'

'ఆ: సరే: భార్యవద్దకు వచ్చి తనకక్షలన్నీ కప్పిపుచ్చుకుని క్షేమంగా వున్నాడు. అప్పుడు మాదుర్గ...అదే సరసు వదనం ఆనందంతో కలకల్లాడి పోయింది. ఆ ప్రణయ వృక్షానికి కలకలం లేకుండా వారికాలచక్రం గిఱ్ఱున తిరుగుతోంది.—